# అమ్మ ఒడి

''ఎంత దూరం వుంటుంది నాయిడూ ?'' అడిగేడు వేణు. పొలాల గట్లమీద నడవడం అలవాటులేక తడబడుతూ నడుస్తున్నాడు. నాయిడు ముందు నడుస్తూ -

''అదిగో బాబయ్యా రెండడుగులే ఆ తాటి పెండెలేదూ. ఆ వెనకే మన తోట'' అని చెప్పేడు.

అప్పటి కప్పుడే చీకటి పడింది. శుక్లపక్షం కాబట్టి వెన్నెల వెలుతురులో దారి కనబడడానికేమీ యిబ్బంది కలగలేదు. అయినా అలవాటు లేని నడక వల్ల - అక్కడక్కడ గండ్లు పెట్టిన గట్ల మీద నుండి తూలుతూ నడుస్తున్నాడు.

చలిగాలి కరుస్తున్నట్టు వీస్తున్నది.

ఇద్దరూ ముడుచుకొని నడుస్తున్నారు.

కనుచూపుమేరలో ఏదివున్నా ఇదుగో బాబూ రెండడుగులే అంటాడు రైతు. కాని ఎంత నడుస్తున్నా దూరమవుతూనే వుంది.

ముందెన్నడూ వేణుకి యిలాంటి అవకాశం కలగలేదు - ఆ వెన్నెట్లో ప్రశాంతమయిన ప్రకృతి అందాన్ని చూస్తుంటే చెప్పలేని ఆనందానుభూతిని పొందుతున్నాడు.

గాలికి తాటి చెట్లు గలగల లాడుతున్నాయి, దూరాన్న సరుగుడు చెట్లు ఘీంకారం పెడుతున్నాయి, కీచురాళ్లు రొద చేస్తున్నాయి. ప్రక్కనుండే నక్కలు పరుగెడుతూ అప్పుడప్పుడు మొర్రో అని అరుస్తున్నాయి. అక్కడక్కడ పొలాల్లో రైతులు చలి మంటలు వేసుకుని కబుర్లాడు కుంటున్నారు. ఆ ఒడ్డమ్మట పారే ఏటిగాలి జువ్వుమని ఒంటిని కుద వేస్తూంది.

దారిలో ఎదురయిన ఓ మంట దగ్గర నాయిడు ఆగి చుట్ట వెలిగించాడు.

''ఈ పల్లం మీకూ పెదబాబుగారికీ, వుమ్మడి. అల్లదో ఆ తాటి పెండె అద్దు..'' అని చేత్తో చూపెడుతూ అన్నాడు.

''చిన్న బుగత గారేఁటి?'' అని ప్రశ్నించాడు ఒకడు.

''ఈయన్నెపుడూ సూడనేదే యిదే రాడమా ?'' అని మరొకడు అడిగేడు అడ్డపొగ పైకి తీసి.

''అవును. సిన్న బుగతగోరే, తొలిసారి యిదే రాటం, పెద్దబాబుగారు ఏదో పనుండి వూర్లో

నడిచి వచ్చిన అలసట తీరుతున్నది.

నిద్ర కనురెప్పల మీదకి వచ్చింది.

''ఎప్పుడూ రాలేదేమో! బాబుగారికి కొత్త, ఏం బాబూ ఎలాగుంది ?'' అని ఒకడు అడిగేడు. వేణు నవ్వి వూరుకున్నాడు.

''ఇక్కడికి మీ వూరు ఎంత దూరం వుంటుంది నాయిడూ ?'' అని అడిగేడు

''అదేఁటి బాబూ కనబడుతున్నదే. దీపాల ఎలుతురు నేదా ? అదే. ఒక ఫర్లాంగు దూరం వుంటాది!''

అంటూ నాయిడు కటికి కర్రల మంట వేశాడు.

తన సంచీ లోంచి దుప్పటి తీసి కప్పుకున్నాడు వేణు.

''కార్ కార్ మని ఒక పెద్ద పక్షి ఏదో రెక్కలు కొట్టుకుంటూ ఒక చెట్టు మీద నుండి మరో చెట్టుకు ఎగిరిపోయింది.

ఆ శబ్దానికి వేణుకి మత్తు వదిలినట్టయి అటు చూశాడు భయంతో.

ఒక్కొక్క రయితూ మంట చుట్టూ చేరుతున్నారు.

కొంత సేపు రయితులు భూముల గురించి ఎన్నో విషయాలు మాట్లాడుతూ వాళ్ల కష్టాలూ, అవీ, చెప్పేరు, కాని అవేమీ వేణుకి అర్థం కాలేదు. కవుళ్ళూ, కదపాలూ, కిట్టైంటుల్లూ, కట్టు బాడులూ, ఏవో యిలాటి మాటలే చెబుతూవుంటే అవేమిటో కూడా తెలియడం లేదు.

కాని అన్నిటికీ '' ఊఁ '' కొట్టేస్తూనే వున్నాడు.

కళ్లు నాటంతటవే మూసుకు పోతున్నాయి. మగత మగతగా వినీ వినట్టు వింటున్నాడు.

రైతు యింకా చెబుతూనే వున్నాడు.

నెల పదిహేను రోజుల బట్టి యీ చలిలో కళ్లాలలోనే పంటకి కాపు తొంగుంటున్నారని, ఆ మధ్య వర్షాలకి నానా బాధ పడ్డారని, చెబుతున్నాడు. ఆ మధ్య జంతు భయం కూడా జోరుగా వుందని, రాత్రులు, కాపలా వుండడానికే బిఱుగ్గా వుండేదని అంటున్నారు.

వేణు నిద్ర నాపలేక పోయాడు

''నేనింక పడుకుంటాను'' అని అక్కడికా ప్రసంగాన్ని తుంచేసి అన్నాడు.

''తొంగోండి బాబూ మళ్లీ బేగీ లేవాల '' అని వూరుకున్నాడు నాయిడు.

వేణు ముసుగుతన్ని వెచ్చగా పొణకలో పడుకున్నాడు.

వేణుకి ఎన్నడూ తన పొలం చూద్దామని గాని, ఆ వూరు వెళ్దామని గాని ఉద్దేశ్యం కలగలేదు. ఈసారి మాత్రం అన్నగారి బలవంతం మీద ధాన్యం కొలిపించి పట్టుకు వెళ్లడానికి రావలసి వచ్చింది.

వచ్చి, యీ పరిసరాల్లో తిరిగి యీ ప్రకృతి అందాన్ని చూసే సరికి యిన్నాళ్లూ యిలాటి ఆనందాన్ని పొందలేక పోయినందుకు చాలా విచారించాడు. ఇంతకు పూర్వం యీ హాయిని ఎక్కడా పొందలేదు, యిక మీదట, పట్టణాల్లో జీవించే తనకు యిలాటి అనుభవం లభ్యమవుతుందా ? అని కూడా అనిపించింది. తలుచుకోనక పోయినా భగవత్సంకల్పం వల్ల యీ విశేషం కలిగినందుకు

పొంగిపోయేడు.

మగతగా ఆలోచించుకుంటున్న వేణు ఒక్క మారు భయంకరంగా ఏడుస్తున్న నక్కల అరుపులు విని లేచి కూర్చున్నాడు. తనతో సహా చుట్టూ రైతులు వుండడం వల్ల మళ్లీ కుదుట పడ్డాడు. వికారపు అరుపులు వినిపించినా లెక్క సేయలేదు. రైతులు నోట్లో చుట్టలు పెట్టుకొని అడ్డపొగ వేసి ఏదో మాటాడుకుంటూనే వున్నారు. ఆ గొణగొణ తనకేమీ బోధ పడలేదు. యింకా నయం, తను వులికి పడడం వాళ్లు చూడలేదు.

మంచి కొచ్చినా, చెడ్డకొచ్చినా, కష్టాని కొచ్చినా, సుఖానికి వచ్చినా తనా రాత్రి అక్కడకు వచ్చి పడుక్కుంటేనే గాని, పెందరాడే ధాన్యం కొలిపించి బస్తాలు కుట్టి లారీ కెక్కించడం అవదు. అలా కాకపోతే సాయంత్రానికయినా - యింటికి చేరుకోవడం కష్టం. లేకపోతే, ఆ పొలాల్లో, రెండు మూడు రోజులుండడం అంటే మాటలా ?''

మళ్లీ ఆలోచనలు ప్రక్కకి పోయి వేణుకి నిద్ర పట్టింది; క్రొత్త ప్రదేశం అయినా, తనెన్నడూ అలాటి పడకకి, అలవాటు లేనివాడయినా ఆ చల్లటిగాలికీ, ఆ వాతావరణానికీ సుఖంగా వళ్లు మరిచి నిద్రపోయాడు.

కొంత సేపటికి, తల దగ్గర ఏదో లాగుతున్నట్టు చప్పుడయి త్రుళ్లి పడ్డాడు. మెలుకువ రాగానే ''ఇదేమిటిలాటి చోట వున్నాను ?'' అని అనిపించినా తను పొలం లోకి వచ్చిన సంగతి జ్ఞాపకం తెచ్చుకుని నవ్వుకున్నాడు, తల దగ్గర అడుగున పరిచిన గడ్డిని ఎద్దు లాగి పరపరా నవులుతూంది. -

దూరంగా చెఱకు చేను దగ్గర ఎలుగ్గొడ్డును కాబోలు రైతులు పెద్ద కేకలు వేస్తూ తగులుతున్నారు.

కొందరు రయితులు ధాన్యం కుప్పల క్రింద గడ్డి దుబ్బుల్ని చిన్న గృహాల్లా చేసి, కుప్పకీ కుప్పకీ మధ్య గడ్డితోనే మిద్దెల్లా చేసి వాటిల్లోనూ, కొందరు బళ్లక్రిందా, యిలా తలొక చోటా పడుక్కున్నారు. వంటి మీద పూర్తిగా బట్ట అయినా కప్పుకోకుండా. వాళ్లకు చలివెయ్యదు కాబోలు ! దోమల బాధ లేదు కాబోలు.

అప్పుడప్పుడు చిన్న పిల్లల కేకల్లా పక్షుల కిచకిచలు వినబడుతున్నాయి. చనిపోయిన వాళ్లకోసం ఏడిచినట్టు నక్కలు అరుస్తున్నాయి. వేణుకి నిద్ర పట్టలేదు.

రైతుల గురకలు వినిపిస్తున్నాయి.

వాళ్లకి లేని భయం తనకెందుకో -

చెరువుగట్టు మీద వెన్నెల కాంతులు రకరకాలుగా పడి వింత వింతగా కనబడుతున్నాయి. ఆ వెలుగు నీడల వయిపు అప్రయత్నంగా చూశాడు.

దూరంగా చెరువు గట్టు మీద నుండి చెట్ల నీడల మధ్య ఏదో తెల్లటి ఆకారం కదిలి వస్తున్నట్టు చూశాడు!

ఎవరయి వుంటుంది ? అని ఆశ్చర్య పోతూ చూసాడు, ఈ అర్ధరాత్రి బెంగా బెదురూ లేకుండా ఒంటరిగా ఎవరో ఏమిటో ? అయినా యీ పల్లెటూరి విషయాలూ, అలవాట్లూ అతనికట్టే తెలియవు.

ఆ వ్యక్తి యిటే వస్తున్నట్టున్నా ఆ చలిలో లేచి కనుక్కునేటంత అవసరం అతనికేం! ఏమంటే ఏమొస్తుందో అని వూరుకున్నాడు. కళ్లు మూసుకుని ముసుగు వేసుకున్నాడు. కాని నిద్ర పట్టనిదే! ఆ వచ్చేది ఎవరో ఏమిటో కనుక్కోవాలనే కుతూహలం, అటు చూడాలనే కోర్కె పీడిస్తూనే వుంది! అటు చూడు అని ఏదో శక్తి ప్రేరేపిస్తూ వున్నట్టుంది.

ఏటిగాలి ఒక్కసారి రివ్వుమని వీచింది.

ముసుగు మరీ బిగించి ముడుచుకున్నాడు.

అడుగుల చప్పుడూ వాటితో సహా గాజుల గలగలా వినిపించి దగ్గరగా రాసాగింది! వేణుకి అనుమానం ఎక్కువయింది. కాని ముసుగు మాత్రం తీయడానికి సాహసించలేదు.

. ఆఖరికాఖరికి ఆ ధ్వని అతనికి దగ్గరగా వచ్చి - అతని తల దగ్గరే ఆగినట్టు గ్రహించాడు.

కొంచం భయం భయంగా వున్నా వచ్చిన సవ్వడి వల్ల వచ్చినది స్త్రీ అని వూహిచడం వల్ల మెల్లగా దుప్పటి తొలగించి, కదలకుండా చూశాడు. అనుకున్నంతా అయింది!

ఆమె ఎవరో ? ఏమనడానికి అతనికి తోచలేదు. ''తన దగ్గరికి యీమె రావడానికేమి కారణం ? ఏం పని ? అతను వచ్చినట్టు యీమెకెలా తెలుసును ? అసలు యీమె ఎవరు ? తనునెలా ఎరుగును? దొంగతనానికి రాలేదు కదా ? యిలాటి ప్రశ్నలెన్నో అతనికి కలిగేయి. ఇంకా ఏం చేస్తుందో చూద్దాం అని కదలకుండా కనిబెడుతున్నాడు వేణు.

ఆమె అంతటితో ఆగలేదు. స్వయంగా ఆమె చేతులతో భుజాలు తట్టి లెమ్మని లేపనే లేపింది-

వేణు ఈ ప్రవర్తనకి ఆశ్చర్యంతో బిక్క మొహం వేశాడు ! ఏమనడానికీ తోచక లేచి కూర్చున్నాడు. కూర్చోవాలని తను ప్రయత్నించకపోయినా బలవంతాన్ని కూర్చోబెట్టినట్టు ఫీల్ అయాడు. ఆశ్చర్యంతో గత్యంతరం లేక ఆమెవైపు చూశాడు, తేరిపారా చూశాడు.

''ఎవరీమె ? దేవకన్యకాదు కదా ?'' అనుకుంటూ వూహల్లో తేలిపోతున్నాడు వేణు. అలా అనుకున్నవాడల్లా కొంతసేపటికి ఆమె ప్రభావనికి లోనయిపోతున్నాడు. ఎంత విచిత్రం ! కొందరిని చూసేంత వరకూ ఏమీ అనిపించదు. ఒకసారి చూశాక వాళ్లను మరిచిపోలేము !

ఆమె సరసన వేణుకి భయం తీరింది. - ఆమె వయిపే చూస్తూ మంత్రబద్ధుడయినట్టు వుండిపోయేడు.

ప్రకృతి ప్రశాంతంగా వుంది, వెన్నెల పరచుకుని వుంది. చుట్టూ చెరువూ, చెట్లూ కొండలూ, తనని ఆహ్వానిస్తున్నట్టు, తమలో లీనం అయిపోయి తమలాగే ఆనందాన్ని, నిశ్చలంగా, నిర్మలంగా అనుభవించమని పిలుస్తూన్నట్టున్నాయి. అవన్నీ తామున్న చోట ఆనందాన్ని పూర్తిగా పొందగలవు. ఎల్లకాలం పుట్టిన దగ్గర్నుండి ఆఖరు వరకూ అక్కడే అనుభవించగలవు.

కాని తాను మానవుడు. చలించడం అతని స్వభావం. ఒక్కచోట అతను వుండలేడు. అది అతనికి రుచించదు. ఏ ఒక్కటీ అతనికి ఆనందాన్ని యివ్వలేదు. -

ఏ ఒక్కరిని అతను పూర్తిగా, నిర్వికారంగా పవిత్రంగా నమ్మి ఆనందించలేడు.

మానవుడికి యీ స్వాతంత్ర్యం యిస్తే నాలుగూ తెలుసుకొని - మంచీ ,చెడూ గ్రహించి

సుఖించగలడేమో అని భగవంతుని నిర్ణయం కావొచ్చు - కాని - ఆ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగ పరచి, తనే సర్వజ్ఞుడనుకొని, తనే ఆనంద స్వరూపుడనుకొని ఏమీ పొందలేకపోతున్నాడు - అది పొరపాటని ప్రకృతి పదే పదే హెచ్చరిస్తున్నా - ఆ నిశ్చల స్వరూపమే పరమానందమని తెలుసుకోలేకపోతున్నాడు. మీదు మిక్కిలి ప్రకృతిని జయించి అదుపులో పెట్టాలని చూస్తున్నాడు.

ప్రకృతి తల్లి వంటిది ఓర్పు సహజం. తానే ఓడిపోయినట్టు ఒకో సందర్భంలో అనిపించినా అది ఆమె సహనమే కాని మరొకటి కాదు. కన్న తల్లికి ఒకప్పుడయినా మనం పెద్దవాళ్లలా గొప్ప వాళ్ళల్లా కనబడవచ్చు కాని - ప్రకృతి మాతకు మన మెప్పుడూ పసి పాపలమే ఆమె యిస్తేనే మనం తినేది. ఆమె శక్తి స్వరూపిణి, విజృంభించినదంటే - ఎన్ని వున్నా చూస్తూ వూరుకోవలసిందే - ఆమె ముందు మనం అశక్తులం. అర్భకులం. అసలు ఏ శక్తినయినా ఆమెలో నుండే కదా - మానవుడు తీసుకుని ఉపయోగించుకుంటున్నాడు. అటువంటిది. - ఆమెలో లేనిదీ ఆమెకు సాధ్యం కానిదీ ఏముంటుంది ? మనం ఏది క్రొత్తపని చేసినా దానికి మూలం ప్రకృతే కదా ! యింకా మనకు తెలియని క్రొత్తలు ప్రకృతిలో ఎన్ని వున్నాయో ! .

అలాంటి ప్రకృతి ఆహ్వానిస్తున్నట్టువుంది. వేణుకు సంతోషంగా వుంది. ఆమె వశీకరణ శక్తికి తాను కరిగి పోతున్నాడు. క్షణ క్షణం లొంగిపోతున్నాడు - ఆ సంగతి అతను గ్రహించే లోపలే ఆమె అతనిని తట్టి లేపింది. అతను త్రుళ్ళి పడ్డాడు. కాని అది విచిత్రంగా వుంది. తనకు వేరే ఆలోచనలు గాని, వేరే భావాలు గాని స్వతంత్రంగా కలగడం లేదు. ఆ స్పర్శతో తనకున్న శక్తులన్నిపోయి మానవాతీతమయిన శక్తి ఏదో ప్రవేశించినట్టయింది. చేతనా చేతనంగా, తెలిసీ తెలియని విధంగా అదో వింత అనుభూతి కలుగుతూ ంది. -- ఆమె ఏమో మాటడుతూంది. తను జవాబు చెబుతున్నాడు. అతను కూడా ప్రశ్నిస్తున్నాడు. ఆమె చెబుతున్నది. అంతా కల అనుకోడమా ! ఆమె ఏమిటడిగింది? తనేం చెప్పేడు ? అన్నవి జ్ఞాపకం లేవు. ఆమె అడిగే క్షణం లోనీ, తను చెప్పే క్షణంలోనీ తెలివి వుంది తరువాతలేదు. యిదేం అవస్థ ? ఒకటి మాత్రం నిజం. అతను చేయగలిగిందల్లా ఆమె ఏం చెబుతే అది ఏం చేస్తే అది - ఆమెను అనుసరించడం తప్పవేరే ఏం చేయలేకపోతున్నాడు.

ఆమె తనతో ఆడుతున్నది ! పాడుతున్నది ! తనూ అన్నీ చేస్తూనే వున్నాడు. అంతా ఆనందమయంగా వుంది. ఆశ్చర్యం ! ఆ ప్రదేశంలో అంతసేపూ తన ప్రక్కనే నిద్రుస్తున్న రైతులూ, ఎద్దులూ, కనబడలేదు. ఆ ప్రదేశం యింతకు ముందుకన్నా ఎంతో ప్రకాశవంతంగా, కన్నుల పండుగగా వున్నది. ఆ చెరువు గట్ల మీద చెట్ల నీడల్లోనూ, వెన్నెల చల్లదనంలోనూ, హాయిగా వీచే చల్లని గాలుల్లోనూ అనిర్వచనీయమయిన ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

ఆ సమయంలో బాహ్య ప్రపంచంతో అతనికి సంబంధం లేదు - కాలమూ, పరిసరాలూ, వాటిని సూచించే యీ లోకపు శబ్దాలూ, సూచనలూ, మార్పులూ, ఏమీ తెలియడం లేదు.

కొంతసేపటికి కలనుండి మేలుకున్నట్టు అయింది వేణుకి - పూర్వం తను పడుక్కున్న పాక దగ్గరకు వస్తున్నట్టయింది. ఆమె మళ్లీ, గడ్డిమోపులూ, తను పడుక్కున్న పాక, పడుక్కున్న రైతులూ, పొలం దగ్గరకి తీసుకు వచ్చింది.

మెల్లగా అక్కడ తనను వదిలి - ఆ మళ్ళ గట్ల మీద నుండి దూరంగా వున్న వరికుప్పల వయిపు వెళ్ళిపోతూంది.

ఒక చల్లటి గాలి తెర... నెమ్మదిగా గట్ల మీద నుండి, చెట్ల కొమ్మల క్రింద నుండి... పొలాలు దాటి - ఏటి వయిపు దూర దూరంగా అలల్లా వెళ్ళిపోతున్నట్టయింది.. ఆమె అడుగులకి చెట్ల ఆకులు మువ్వల వప్పుళ్లలా గలగలలాడేయి.

వేణు ఆమె వెళ్లిన వయిపే, నిశ్చేష్టుడయి, విచారంగా చూస్తూ వుండిపోయేడు.. ఆమె వరికుప్పలు దాటిపోయి కనుచూపుకు ఆనడంలేదు!

ఒకసారి త్రుళ్లి పడ్డాడు వేణు.

లేచిచూసేసరికి దూడ ఒకటి తన దుప్పటి లాగేస్తూ నములుతున్నది. విదిలించుకుని లేచాడు... అటూ యిటూ చూసి దిగ్భ్రమ చెందాడు. తనూ - పాక - ప్రక్కన రయితులూ.. అంతా మామూల్గానే వున్నది.

దూరాన్న కనుచూపు మేరలో వున్న వరి కుప్పల వయిపు చూశాడు. అంతా ప్రశాంతంగా వుంది.

మరి వేణుకు నిద్ర పట్టలేదు... ఇప్పుడు జరిగిందంతా ఏమిటి ? కలా ? నిజమా ! ఆమె ఎవరు!

అడిగినట్టే వుంది - ఆమె ఏదో చెప్పింది కాని - ఏం చెప్పింది ? ఏమీ జ్ఞాపకం లేదు... ఆమె మనిషేనా ? కాదు. ఏదో మాయ.. శక్తి! ఏమిటది ?...

ఆమెతో వున్నంత సేపూ, ఎంతో హాయిగా వుంది; ఆమెలో సర్వ శక్తులూ వున్నట్టున్నాయి. ఆమె యిష్ట ప్రకారం నడిచినంత ఆనందం యింకోటి లేదు. ఈ ప్రకృతి సర్వస్వానికి ఆమె మహారాణిలా వుంది...!

ఏమిటీ ఆలోచన ? యిదంతా ఒక భ్రమా !...కలా ? కాదు... కల ఎలా అవుతుంది ? ఆ అనుభవం ప్రభావం యింకా తన మీద వున్నదే ! తన లోని ప్రతి అణువూ, ఆనందాన్ని నెమరు వేసుకుంటున్నదే! నమ్మకపోవడం ఎలాగ? అయితే ఆమె ఏమయినట్టు ? మాయమయిందా ?

ఇలా ఎటూ తెగని ఆలోచనల్లో పడిపోయాడు వేణు. ఆ తెల్లవారు ఝామున, ఆ చల్లటి వాతావరణం శరీరాన్ని కరుస్తూంది. ఒణుకుతూ కూర్చున్నాడు.... కోడి కూసింది. పక్షుల కిలకిలలు పసిపిల్లల కేరింతల్లా వినబడుతున్నాయి. జువ్వుమని చలిగాలి వీస్తూంది. రయితులు మేలు కొలుపు పాడుకుంటున్నారు. ఒళ్లు విరుచుకు లేస్తున్నారు. కొందరు చలికి కటికి పుల్లలు మంటలు వేసుకుంటున్నారు. మరి కొందరు గాలికి ధాన్యం పట్టడం ప్రారంభించారు....కాని నూర్పు పూర్తి కాలేదు.

ఆ రోజూ కూడా వుండిపోవాల్సి వస్తుందని .... పరధ్యాన్నంగా ఆలోచిస్తూ వేణు కూర్చుని వుండగా - తన అన్నగారు నలుగురయిదుగురు వ్యక్తులను వెంట బెట్టుకొని వచ్చాడు.

''వేణూ యింకా పూర్తికాలేదా ?'' అని అతను అడిగేటప్పటికి యీ లోకంలోకి పడ్డాడు.

''లేదన్నయ్యా! అదే ఆలోచిస్తున్నాను!'' అని జవాబిచ్చేడు.

''పోనీ రేపటికి అంతా పూర్తి అయిపోతుందిలే! యిప్పుడేం మించిపోయింది లేదు!.. యీ లోపుని మరో పని కూడా వుంది. అదికూడా చూసుకోవచ్చు''

- అని అంటూ ఆ వచ్చిన వ్యక్తుల వయిపు చూశాడు.

వాళ్లు చిరునవ్వులు నవ్వేరు. వేణు వయిపు చూస్తూ -

''వేణూ యిలా మాట!'' అని పిలిచి దూరంగా తీసుకువెళ్లాడు అన్నయ్య.

''ఒరే వేణూ యిన్నాళ్ళూ ఎలాగో భూముల్ని చూసుకుంటూ వచ్చాం! రయితులు కూడా కాదనకుండా యిచ్చేస్తున్నారు. కాని రోజులు మారిపోయినాయి. యింకా యీ భూముల్ని నమ్ముకోడం అర్థంలో డబ్బు మూట లాటిది.. అందుకోసమే మనలాటి ఉద్యోగస్తులు ఎక్కడో వుండి చూసుకోడం కష్టం... కాబట్టి యివన్నీ ఆలోచించి మన భూముల్ని అమ్మి వేయడానికి నిశ్చయించాను... ఏమంటావు? అదుగో వారిని అందుకే తీసుకు వచ్చాను!'' అని అన్నాడు.

''ఇన్నాళ్లు తల్లిలా పోషించిన భూములను అమ్ముకోవడమా! అదేమిటన్నయ్యా?'' అని ఆశ్చర్యంతో అన్నాడు వేణు!

''కాకమరేమిటి చేసేదీ? నౌకరీ మానివేసి యీ భూముల దగ్గర నేను వుండగలనా? నీవు వుండగలవా?.... నాకు మాత్రం యిష్టమా? తల్లిద్రులు గణించినది మనం గుణించవలసి వచ్చింది...''

''పోనీ నేను వుండిపోతాను!''

''అదేం అంత సులువు కాదు... భూమి దున్ని... పండించడం.. మాటలు కాదు.. మనలాటి వాళ్లం... చేయాలంటే... చాలా త్యాగం చేయాలి!'' అని అన్నాడు.

నిజమే! చెప్పినంత సులువా? ఒకరోజు ఈ వాతావరణంలో వుండేసరికే తను ఎంతో బాధ పడిపోయాడే యింక జీవితాంతం వుండాలంటే జరిగే పనేనా? యిలా ఆలోచించుకుని. మరేమీ జవాబు చెప్పకుండా వూరుకున్నాడు వేణు.

''ఆ వ్యవహారం అంతా నే, చూసుకుంటాలే.. యిదుగో, యీ భూదేవి మనకిస్తున్న ఆఖరి ప్రసాదం యిదే! యీ గింజలు తీసుకుని... ఒక నమస్కారం చేద్దాం! యిక యీ తల్లికీ- మనకీ ఋణం తీరిపోయింది. యివాళే రిజిస్ట్రేషను కూడా చేయిస్తాను. ఈ రాత్రికి కూడా నువ్వు యిక్కడే వుండి రేపు వుదయం లారీలో బస్తాలు పట్టించుకురా!'' అని అన్నాడు.

అనుకున్నట్టుగా ఆ రోజే రిజిస్ట్రేషన్ అయిపోయింది; ఇరవై వేలకు అమ్మివేశారు....

ఆ రోజల్లా పట్నంలో కోర్టుల్లోనూ, క్లబ్బుల్లోనూ గడిపి మళ్లీ సాయంత్రానికల్లా పొలం చేరుకున్నాడు వేణు. నిద్రలోకి... జారుకున్నాడు....

ఆకాశంలో మబ్బులు క్రమ్మనారంభించాయి, ఉన్నట్టుండి - మెరుపులు ఉరుములుతో గాలివాన ప్రారంభమయింది. ప్రళయంలా భయంకరంగా - బీభత్సంగా మారిపోయింది! చెవులు చిల్లు పడేట్లు ఉరుములు, కళ్లు మిరుమిట్లు గొలిపేటట్టు మెరుపులు భూమి పగిలేట్టు పిడుగులు, కుండపోతలా వర్షం. ఏర్లు వరదలతో ముంచెత్తుతున్నాయి. చెరువులు గట్లు తెగి ప్రవహిస్తున్నాయి, సముద్రాలు

పొంగిపోయాయి. చెట్లు చేమలు, పూరిళ్లు, మనుష్యులు, జంతువులు, ఆ మహాప్రవాహంలో హాహాకారాలు చేసుకుంటూ దిక్కు లేకుండా కొట్టుకుపోతున్నారు. పారిపోతున్నారు.

మెరుపులకి కళ్లు తెరుస్తున్న ఆకాశం - ప్రకృతి మూడో కన్ను తెరుస్తూన్నట్టు వుంది. యీ వికృత ప్రళయ విజృంభణలో - ప్రకృతీ, సర్వ జీవరాసులూ సర్వనాశనం అయిపోతున్నట్టుంది. గ్రహాలు క్రమం లేకుండా తిరుగుతూ, ఒకదాని ఒకటి ఢీ కొని బ్రద్దలయి పడిపోతున్నాయా అనిపిస్తూంది.

ఈ దృశ్యం అంతా ఒక్కసారి మాయమయింది. - మళ్లీ పొలాలూ, చెట్లూ ... కాని అన్నీ చిందర వందరయి పడిపోయి వున్నాయి. అక్కడ చెరువులో ఏమిటి అల్లకల్లోలం ? నీరంతా నల్లగా మారిపోయి- సలసల మరిగిపోతూ పొంగుతున్నట్టుంది. పొగలు, మంటలు వస్తున్నాయి. అదొక ''కాళింగి'' సరస్సులా అనిపించింది ! వేణుకి. ఆ చెరువులో నీరు సర్పాకారంలో అలలు విరుస్తూ పొగల్ని చిమ్ముతూంది. ప్రక్కనున్న కోవెల మాత్రం చెక్కు చెదరకుండా అలాగే వుంది ! అంతలో తూర్పు పడమరల నుండి రెండు పెద్ద మేఘాలు ఢీకొని - ఫెళ్లుమని విరిగిపోయి నాలుగు దిక్కులా పడిపోయినాయి... పడినచోట మంటలు లేచాయి. ఆ జ్వాలలు నాలికలు చాచుకొని అందిన వాటిని ఆహుతి చేస్తున్నాయి. -

వేణు త్రుళ్లిపడ్డాడు. ... గుండె ఆగినంత పనిఅయింది ! ఆ దృశ్యం చూడలేకపోతున్నాడు. కళ్లం అంతా రావణాసురిడి కాష్టంలా కాలుతూంది. ఎండిన గడ్డేమో మంటలు మిన్ను ముడుతున్నాయి - ఒక గడ్డి కుప్ప ఎర్రగా కాలి ఉదయించే సూర్య బింబంలా వుంది. కాని - చుట్టూ కాంతి లేదు. ఎర్రగా కాలిన గడ్డి పరకలు గాలికి విజృంభించి ఎగురుతున్నాయి, మహా సర్పాలు బుసలు కొడుతూ తను చీలిన నాలికల్ని పైకి తెస్తూ వదులుతున్నట్టుంది. ఒక మహా రాక్షసి అగ్నిగుండాల వంటి కళ్లను విప్పి పరుగెట్టి మీదకు వస్తున్నపుడు ఆమె చింపిరి తలమీద భయంకరంగా గాలిలో రెపరెపలాడుతూ వూగే తలవెంట్రుకల్లా వున్నాయి.

ఈ బీభత్సానికి అర్థమేమిటో వేణుకు బోధపడలేదు - మామూలుగా గడ్డి కుప్ప కాలితే యింత భయంకరంగా వుంటుందా ? యింత వికృతంగా వుంటుందా ?... జరిగిన వాటి గురించి యిదమిద్ధమని తేల్చుకోలేకపోతున్నాడు. - గడ్డి కుప్పల ఎరుపు వర్ణం తగ్గుతూ బూడిద తెలుపు, వెల్లవేసినట్టు మారుతోంది. కొన్ని కుప్పలు బ్రద్దలయి విరిగి పడి వున్నాయి. యింకా కొన్ని అగ్ని పర్వతాల్లా రాజుకొంటున్నాయి, కొన్ని కుప్పలు బూడిదయి మిగిలినాయి. వాటినిచూస్తే- ప్రళయ కాలంలో పరమశివుని శరీర పూతకయి యీ బూడిద పోగు చేశారా ? అనిపిస్తూంది.

ఆ పడిపోయిన చెట్ల వయిపూ, కాలిపోయిన వరి కుప్పల వయిపూ అల్లకల్లోలమయిన చెరువు వయిపూ, ఆ మందిరం వయిపూ - ప్రకృతి విలయ తాండం చేసి నాశనం చేసిన ఆ పరిసరాల వయిపు దిగ్భ్రాంతుడై చూస్తూ ఆశ్చర్యపోయాడు...

సందేహం లేదు... ఆమె !.. ఆమెయే... మెల్లగా అల్లంత దూరం నుండి వస్తూంది!... ఆశ్చర్యం!.. యింత ప్రళయంలోనూ తను ఎలా బ్రతికి వున్నాడు... యీ గాలిగాని, యీ వర్షంగాని,

తనను ఏమీ చెయ్యలేదేమి! ఆ సమయంలో తనెక్కడ వున్నాడు! ఇదంతా కల? నిజమా?... ఇంతవరకూ ఈమె విషయమే జ్ఞాపకం రాలేదేమి?.... నయమే. యీమె వస్తే ఏమయివుండేది? అదిగో దగ్గరగా వస్తోంది. ఓ పెద్ద సంబరంలా వస్తూంది. పిల్లగాలిలా తేలిపోతూ వస్తూంది! ఆనందాన్నంతటినీ మూటకట్టుకొని వస్తూంది!...

ఎదురుగా పరిగెట్టుకుంటూ వెళ్లి - తల్లిని ఎడబాసిన బిడ్డలా చేతులు చాచాడు. ఆమె వాత్సల్యంతో అందుకుంది.

వేణు పసిబిడ్డలా వాపోయాడు! భక్తునిలా ఆమె ముందు మోకరిల్లి వద్దు తల్లీ! వద్దు! నన్ను విడిచి వెళ్లవద్దు! ... ఈ ప్రపంచం మారిపోయింది. అంతా - అసహజంగా తయారయింది! స్వచ్ఛతను కోల్పోయింది! మనుషులు నిజాయితీని కోల్పోయారు! ఎక్కడ చూసినా, ఏది చూసినా విషపూరితమయిపోయింది!...గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశం, తమతమ స్వభావాన్ని కోల్పోయాయి! అంతా కలుషితమయం! - అరణ్యం జనారణ్యమయింది! ప్రకృతి, వికృతిగా మారిపోతూంది! జీవరాసులకు నిలువ నీడ లేకపోతూంది! మనుషుల్లో కుళ్లు, కపటం, ఈర్ష్య, ద్వేషం - దౌర్జన్యం, హింసా ప్రవృత్తి, ప్రకోపించాయి. ప్రేమ, దయ, కరుణ నశించాయి. ఎక్కడా ప్రశాంతత లేదు. తమని తాము విధ్వంసం చేసుకొనే ప్రయత్నాలలో మునిగి తేలుతున్నారు.! యిలాటి ప్రపంచంలో నేనుండలేను! నాకు విముక్తి ప్రసాదించు...నాకు నీ చల్లని ఒడి కావాలి!''

అని విన్నవించుకున్నాడు.

ఆమె ఆలయం వయిపు నడిచింది... చెరువుదాటి, చెట్లలోంచి, వెన్నెలలోంచి, మలయ మారుతంలా వెళ్లిపోతూంది. వేణు అనుసరిస్తున్నాడు... ఏరు వచ్చింది! ఏరు మామూల్గాలేదు. పరవళ్లు త్రొక్కుతూంది!.. ఆమె ఒక నావలాగ కదిలి పోతూంది! ఆ ప్రవాహంలో ఎదురీదడానికి వేణుకి శక్యం కావడం లేదు!

నీటిలో పోటు ప్రతిక్షణానికీ ఎక్కువతూ వుంది! ఆమె క్షణక్షణానికీ వేయి వెలుగులతో ప్రకాశించిపోతూంది! యింతలో ఏటిలో ఆకస్మాత్తుగా పొంగు వచ్చింది. కొండంత ఎత్తున కెరటంలా నీరు మహావేగంగా వచ్చింది... ఆ వేగానికి వేణు తట్టుకోలేకపోయాడు, ఆ వుప్పెనలో తను వేరయిపోయాడు...

వేణు నిస్సహాయుడై పోయాడు. ఇంతవరకూ ఆమె చెయ్యి పట్టుకొని యీదుతూండడం వలన నెట్టుకు వచ్చాడు. యింక తనకు కాళ్లూ చేతులూ ఆడడంలేదు. ప్రవాహ బలం ఎక్కువయింది. శరీరాన్ని లోపుకి లాగేసు కుంటూంది. ... ఆమె కోసం అరిచేడు. చుట్టూ చూశాడు. ..కాని ఆమె నీట్లో లేదు? మరెక్కడుంది? ...

నీటికి మీదున.. ఆకాశంలోకి - శూన్యంలోకి పోతూ పోతూ తనకోసం ఆగి.. తనను చూసి రమ్మని కాబోలు చేతులు చాచి - నిలబడివున్నది. వేణుకి ఏమీ పాలు పోవడం లేదు.... ఆమెను చేరుకోడం ఎలాగ? తను మాత్రం నీళ్లలో కొట్టుకుపోతున్నాడు. ... అతని శక్తి నశించి పోయింది. నీళ్లు మ్రింగేస్తున్నాడు.... శరీరం తన ఆధీనం తప్పింది - ఏదో పాతాళం లోకి లాక్కుపోతున్నట్టు

అనిపించింది... ప్రాణాలు పోతున్నాయి. తను పూర్తిగా మునిగిపోతున్నాడు.... ''రక్షించు తల్లీ రక్షించు'' అని అరిచాడు.

ఆమె పరుగు పరుగున వచ్చింది. తన చేతులు పట్టుకుంది.... అంతే అలా పట్టుకుందో లేదో... వేణుకి ఒక పెద్ద బరువు తన నుండి తొలగిపోయినట్టయింది. అతి మెల్లగ్గా గాలిలో లేచి పైదకు పోయినట్టనిపించింది.-- మరుక్షణంలో ఆమెతో కలిసి ఆకాశంలో వున్నాడు. ఆశ్చర్యం క్రింద ఏరు పరవళ్లు త్రొక్కుతూ ప్రవహించిపోతూంది - ఆ ప్రవాహంలో - ఏదో కొట్టుకు పోతున్నట్టు చూసాడు... అది తన శరీరమే. అయితేనేం ఏదో పనికిరాని వస్తువ పారవేసినట్టు అనిపించింది... అలా... అలా... మేఘాలు దాటి... చంద్రుణ్ణి దాటి.... నక్షత్రాలు దాటి... ఎక్కడికో... గోళాల అంతరాంతరాలలోకి... శూన్యంలోకి... చీకటిలోంచి వెలుగులోకి.... ఆమెతోపాటు.... వెళ్లిపోయాడు!

★ ★ ★

పక్షుల కిలకిలా రావాలతో - పొలాల మీద నుండి వచ్చే కమ్మని వాసనలతో చల్లని గాలులతో - ఉదయ సూర్యుని బంగారు కిరణాలతో... తెల్లవారింది...

రైతులు లేచారు. ఒకరైతు కాఫీ పట్టుకు వచ్చి - పాకలో చూశాడు. చిన బుగతగారి కోసం!

కాని చిన్న బుగత వేణు ఏడీ? కాలకృత్యాలకి వెళ్లి వుంటాడేమో అని భావించారు. కాని ఎంతసేపటికీ రాకపోయేసరికి అందరూ గాభరా పడజొచ్చారు.

మళ్లీ పట్టణంలోకి వెళ్లాడా? ఎవరికీ చెప్పకుండా, అలా వెళ్లిపోతాడా? వాళ్లకేమీ పాలుపోలేదు. ప్రొద్దెక్కుతున్న కొద్దీ వాళ్లకు అనుమానం, ఆందోళన ఎక్కువవుతూంది. చుట్టు ప్రక్కల కలియజూసేరు. గాని ఎక్కడా వేణు జాడ తెలియలేదు. ఒక రైతుని పట్నం పంపేరు. ఇంకొందరు మళ్లీ వెతకడానికి బయలుదేరారు.

ఇలాంటి పరిస్థితిలో వేణు అన్నగారు కబురు తెలిసి పరుగెత్తుకు వచ్చాడు. రాగానే-

''వేణు కనపడ్డాడా?'' అని ఆత్రంగా అడిగేడు.

ఏమని చెప్పగలరు రైతులు?

'' ఇంకా కనబడనేదు బాబూ! చెట్టూ, పుట్టా గాలిత్తన్ను''

''రాత్రి తొంగుని మరి సూత్తే కనబడనేదు ఎటెల్లేరో ఏటో? ఏరికీ సెప్పనయినా లేదు!'' ఇలా అమాయకంగా భయంతో చెప్పడం మొదలెట్టేరు.

''ఎక్కడికి పోయి వుంటాడు! ఎందుకు పోయి వుంటాడు?'' అని అనుకుంటూ పిచ్చెత్తినట్టు వేసిన ప్రశ్నే వేస్తున్నాడు వేణు అన్నగారు.

ఇంతలో ఒకడు పరుగెట్టుకొని వచ్చి - ఏడవడం మొదలెట్టేడు. ''బాబో కొంప మునిగి పోనాది బాబో!'' అని

'' ఏమిట్రా ఏమి జరిగింది?''

''అంత అయిపోనాది బాబూ! నేనెలా సెప్పేది తండ్రో! మన చిన బుగతగారు, మన చిన

బాబుగోరు... మరిచేరు బాబో!....'' అని బావురుమన్నాడు.

వేణు అన్నగారు ఆత్రుతతో సంగతి అంతా వివరంగా చెప్పమన్నాడు. సగం దుఃఖంతో తల్లడిల్లిపోతూ.

''ఘోరం అయిపోనాది బాబూ... ఎలా సెప్పేది బాబూ.. ఏటి ఒడ్డున .... యింకేటి బాబూ... చిన బాబుగోరు... వేణు బాబుగారు పడున్నారు బాబూ... ఏరుకి బలయిపోనారు బాబూ...'' అని గుండెలు బాదుకుంటూ చెప్పేడు. అందరూ ఆటు పరుగెట్టేరు....

ఏరు నిర్మలంగా... భగవంతుని విశాల హృదయంలా పరచుకొని వుంది. ఏటి ఒడ్డున... అమ్మ ఒడిలో హాయిగా నిద్రపోతున్నట్టున్నాడు వేణు!

★ ★ ★

- (అముద్రితం)